# కదంతొక్కిన కరీంనగర్

## అడుగడుగునా కేసీఆర్‌కు నీరాజనం

**దారిపొడవునా గులాబీ పూల వర్షం • కరీంనగర్‌లో రోడ్‌షో గ్రాండ్ సక్సెస్**



సిద్దిపేట పట్టణ శివారు రంగధాంపల్లి చౌరస్తా వద్ద కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్, మే 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/సిద్దిపేట అర్బన్/మర్కూక్/కొండపాక(కుకునూరుపల్లి): ఉద్యమ కాలం నుంచి గులాబీ దళపతి కేసీఆర్‌కు దన్నుగా నిలిచిన కరీంనగర్ మరోసారి కదం తొక్కింది. అశేష జనవాహిని తరలి వచ్చి అపూర్వ స్వాగతం పలికింది. గురువారం ఎర్రవల్లిలోని నివాసం నుంచి కేసీఆర్ బస్సుయాత్ర బయలుదేరిన దగ్గర నుంచి కరీంనగర్ రాంనగర్ చౌరస్తాకు చేరుకొనే వరకు దారి పొడవునా బ్రహ్మరథం పట్టారు. దత్తత గ్రామమైన ఎర్రవల్లి గ్రామస్థులు కేసీఆర్‌కు గులాబీ పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. కుకునూరుపల్లి తోపాటు కొండపాక మండలంలోని దుద్దెడ వరకు రాజీవ్ రహదారి పొడవునా బీఆర్ఎస్ నాయకులు, కేసీఆర్ అభిమానులు, ప్రజలు జనహృదయనేతను చూసేందుకు భారీగా తరలివచ్చారు. మహిళలు మంగళహారతులతో కేసీఆర్‌కు హారతి పట్టారు. భారీగా ప్రజలు తరలిరావడంతో రాజీవ్ రహదారి గులాబీమయంగా మారింది. కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సుపై పూలు చల్లి జై కేసీఆర్.. జైజై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. రాజీవ్ రహదారి మీదుగా వచ్చిన కేసీఆర్.. ఎన్టీఆర్ చౌరస్తా నుంచి బైపాస్‌రోడ్డు ద్వారా రాత్రి 7.50 గంటలకు కరీంనగర్‌లోని రాంనగర్ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితోపాటు పలువురు నాయకుల ఆధ్వర్యంలో వేలాది మంది ప్రజలు అధినేతకు అపూర్వ స్వాగతం పలికారు. మరికొందరు పూల వర్షం కురిపించారు. ప్రజల అభిమానాన్ని చూసిన కేసీఆర్.. బస్సులో నుంచే అభివాదం తెలిపారు. డప్పులు, సంప్రదాయ నృత్యాల మధ్య రాంనగర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ.. మంకమ్మతోట, టూటౌన్ పోలీస్‌స్టేషన్, ముకరంపుర మీదుగా తెలంగాణ చౌక్ వద్దకు చేరింది. దాదాపు 40 నిమిషాల పాటు రోడ్‌షో కొనసాగగా.. దారి పొడవునా రోడ్డు కు ఇరువైపులా జనం నిలబడి కేసీఆర్ జిం దాబాద్ అంటూ నినాదాలు చేశారు. పలు చోట్ల మహిళలు మంగళహారతులతో స్వాగ తం పలికారు. రాత్రి 8.30 గంటలకు తెలంగాణ చౌక్ వద్దకు కేసీఆర్ చేరగానే.. అప్పటికే ఆయన కోసం వేచి చూస్తున్న జనం ఒక్కసారిగా సీం కేసీఆర్.. సీం కేసీఆర్ అంటూ చేసిన నినాదాలు మారుమోగాయి. బస్సు పైనుంచి కేసీఆర్ విజయ సంకేతం చూపుతూ అభివాదం తెలుపుతున్న సమయంలో.. రెండు మూడు నిముషాల పాటు.. సభ జై కేసీఆర్.. సీఎం కేసీఆర్ అన్న నినాదాలతో హోరెత్తింది. అనంతరం కేసీఆర్ సుమారు 25 నిముషాల పాటు ప్రసంగించారు.

### వినోద్‌కుమార్ విజయం ఖరారైంది

కరీంనగర్ నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విజయం ఖరారైందని కేసీఆర్ చెప్పారు. తన దగ్గర ఉన్న సర్వే ప్రకారం ఇప్పటికే 8 శాతం ఓట్ల అధిక్యంతో ముందు వరుసలో ఉన్నారని కేసీఆర్ చెప్పినప్పుడు.. సభలో ఒక్కసారి సంతోషం వ్యక్తమైంది. ఎన్నికల వరకు ఇదే స్ఫూర్తిని చాటి.. అధిక మెజార్టీతో వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరినప్పుడు.. కారు గుర్తుకే మన ఓటు అంటూ నినాదాలు నలుదిక్కులా పిక్కటిల్లాయి. సభలోని చాలా మంది తమ చేతుల్లో కారు గుర్తుతో ఉన్న ప్లకార్డులను పైకి ఎత్తి ప్రదర్శించారు. ఎవరికి అర్థం కాకుండా మాట్లాడే.. సంజయ్‌ను గెలిపిస్తారా? లేక విజ్ఞుడు, న్యాయవాది, ఆది నుంచి తెలంగాణ సాధనకు తనతో కలిసి నడిచిన వినోద్‌కుమార్‌ను గెలిపిస్తారా? అన్న ప్రశ్నకు వినోద్‌కుమార్ జిందాబాద్ అంటూ చెప్పారు. కరీంనగర్ గడ్డ మామూలుది కాదని, తెలంగాణ ఉద్యమానికి అన్ని రకాల బలాన్ని ఇచ్చి ముందుకు నడిపించిందని, మీ దీవెనల వల్లే తెలంగాణ సాధించగలిగామని కేసీఆర్ చెప్పినప్పుడు. సభలో చప్పట్లు మారుమోగాయి.





కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ వద్ద రోడ్‌షోకు హాజరైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగాన్ని బిల్డింగుల పైకి ఎక్కి వింటున్న ప్రజలు

# చెక్కుచెదరని బీఆర్ఎస్ క్యాడర్

## పారని బీజేపీ, కాంగ్రెస్ నేతల పాచికలు

**కేసీఆర్ బస్సుయాత్రతో సమరోత్సాహం**

**విజయమే లక్ష్యంగా గులాబీల సమరనాదం**

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్, బీజేపీలు వేస్తున్న ఎత్తులను బీఆర్ఎస్ క్యాడర్ చిత్తుచేస్తున్నది. గత నెల 24వ తేదీ నుంచి కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రతో గులాబీ శ్రేణుల్లో సమరోత్సాహం తొణికిసలాడుతున్నది. ఆ జోష్ రోజురోజుకూ పెరుగుతున్నది. ఇదే ఉత్సాహం గులాబీ శ్రేణుల్లో కొనసాగితే తమ ఆశలు గల్లంతేనని గ్రహించిన కాంగ్రెస్, బీజేపీల అగ్రనాయకులు బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌ను మచ్చిక చేసుకోవాలని తమ తమ అభ్యర్థులకు, స్థానిక నాయకులకు ఆదేశాలు జారీ చేశారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి దాకా పటిష్ఠంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌ను తమవైపు తిప్పుకోవాలని వ్యూహాలు రచించారు. కొన్ని ప్రాంతాల్లో పాచికలు వేశారు. బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీల్లో చేరి ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్య (వరంగల్), అరూరి రమేశ్ (వరంగల్), దానం నాగేందర్ (సికింద్రాబాద్), సైదిరెడ్డి (నల్లగొండ), బీబీ పాటిల్ (జహీరాబాద్), రంజిత్‌రెడ్డి (చేవెళ్ల), సీతారాం నాయక్ (మహబూబాబాద్), జీ నగేశ్ (ఆదిలాబాద్), ఈటల రాజేందర్ (మల్కాజిగిరి), కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (చేవెళ్ల) తదితరులు తమకు ఉన్న పాత పరిచయాలతో ఆయా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌ను మచ్చిగ చేసుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కానీ, వారి ప్రలోభాలకు, మాయలకు బీఆర్ఎస్ క్యాడర్ లొంగడంలేదు. దీంతో అన్ని జిల్లాల్లో విస్తృత నెట్‌వర్క్ కలిగి ఉన్న బీఆర్ఎస్ పార్టీ పునాదిని కదలించలేమని కాంగ్రెస్, బీజేపీ నేతలకు అర్థమవుతున్నది.

### కేసీఆర్ బస్సు యాత్రతో క్యాడర్‌లో జోష్

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తొలినాళ్లలో బీఆర్ఎస్ శ్రేణులు సహజంగానే ఒకింత నైరాశ్యానికి గురయ్యాయి. దానికి తోడు సిట్టింగ్ ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్, బీజేపీల పంచన చేరడం వారిని మరికొంత నిరుత్సాహ పరిచింది. ఈ నేపథ్యంలో గత నెల 24 నుంచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర ఒక్కసారిగా వాతావరణాన్ని మార్చేసింది. కేసీఆర్‌కు ప్రతిచోటా ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. కేసీఆర్ పాలనలేని లోటు కనిపిస్తుందని చర్చించుకుంటున్నారు. తమ ప్రియ తమ నేతను మళ్లీ ఉన్నతస్థానంలో చూడాలన్న ఆకాంక్షను వ్యక్తంచేస్తున్నారు. కేసీఆర్ పట్ల ప్రజల్లో చెక్కు చెదరని అభిమానాన్ని గమనించిన బీఆర్ఎస్ క్యాడర్‌లో సరికొత్త ఉత్సాహం ఉరకలేస్తున్నది. మరోవైపు, అధికారంలోకి వచ్చీరాగానే బీఆర్ఎస్ కార్యకర్తల మనోబలంపై దెబ్బకొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. దీనిని ధీటుగా ఎదుర్కొనేందుకు కేసీఆర్ కార్యకర్తలకు ధైర్యాన్ని ఇచ్చే కార్యక్రమాలు చేపట్టారు. ఎక్కడికక్కడ లీగల్ టీములను ఏర్పాటుచేశారు. భౌతికదాడులకు బెదిరిపోవద్దని ధైర్యం నూరిపోశారు. ప్రజా తిరుగుబాటుకు కారకులు కావద్దంటూ ఒక దశలో మెదక్ సభలో ఏకంగా డీజీపీని ఉద్దేశించి కేసీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇలాంటి పరిణామాలు బీఆర్ఎస్ క్యాడర్‌లో ఆత్మవిశ్వాసం నింపాయి. ఫలితంగా పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించి తీరాలనే కసి పెరిగింది. ఈ అనూహ్య పరిణామాలు కాంగ్రెస్, బీజేపీలకు శరాఘాతంగా మారుతున్నాయి.



కరీంనగర్‌లో రోడ్‌షో కోసం బస్సులో వస్తున్న తమ అభిమాన నేతను చూసేందుకు దారి వెంట నిల్చున్న అభిమానులు, ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

### మైండ్‌గేమ్‌ను తిప్పికొడుతున్న గులాబీలు

కాంగ్రెస్, బీజేపీల మైండ్‌గేమ్‌ను బీఆర్ఎస్ క్యాడర్ బలంగా తిప్పికొడుతున్నది. వరంగల్, చేవెళ్ల, జహీరాబాద్, మహబూబాబాద్ లోక్‌సభ నియోకవర్గాల్లో ఇరు పార్టీల అభ్యర్థులు, వారి ప్రధాన అనుచరులు బీఆర్ఎస్ క్యాడర్‌లోని ముఖ్యనాయకులను కలిసి తమకు సహకరించాలని కోరుతున్నారు. అయితే, వీరికి బీఆర్ఎస్ క్యాడర్ నుంచి తిరస్కారం ఎదురవుతున్నది. 'మీరు పార్టీలోకి రాకముందే మేం గులాబీ జెండా మోసినం. తెలంగాణ రాష్ట్రం వచ్చేముందు మీరు పార్టీలోకి వచ్చారు. బీఆర్ఎస్ పుణ్యమా అని పదవులు అనుభవించారు. పార్టీ ఇప్పుడు అధికారంలో లేదని వెళ్లిపోయారు. మేం అధికారం కోసం పార్టీలోకి రాలేదు. తెలంగాణ కోసం అప్పుడే కాదు ఎప్పుడూ మేం కేసీఆర్‌తోనే ఉంటం. అధికారం ఉన్నా లేకున్నా... దయచేసి ఇంకోసారి ఇటువంటి ప్రయత్నాలు చేయకండి' అని వరంగల్‌లో ఒక గులాబీ సైనికుడు తెగేసి చెప్పడంతో సదరు అభ్యర్థి బిక్కమొహం వేశారని సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలను చేరదీసి, వారికే టికెట్లు ఇస్తే, ఎక్కడికక్కడ బీఆర్ఎస్ క్యాడర్ కూడా వస్తుందని ఆశించిన బీజేపీ, కాంగ్రెస్ పెద్దలకు చివరకు నిరాశే మిగులుతున్నది.

> 'మీరు పార్టీలోకి రాకముందే గులాబీ జెండా మోసినం. ఇగ తెలంగాణ వస్తది అని తెలిసి మీరు పార్టీల చేరిన్రు. కేసీఆర్ పుణ్యమా అని పదవులు అనుభవించున్రు. ఇప్పడు అధికారంలో లేదని వెళ్లిపోయిన్రు. అధికారం కోసం మేము గులాబీ జెండా ఎత్తుకోలేదు. తెలంగాణ కోసం కేసీఆర్‌తోనే ఉంటం. దయచేసి ఇంకోసారి ఇటువంటి ప్రయత్నాలు చేయకండి'
>
> **- ఇతర పార్టీ అభ్యర్థితో ఒక గులాబీ సైనికుడు**

## • ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా



ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ కామారెడ్డిలో రైతులు గురువారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వం సకాలంలో కాంటాలు వేయకపోవడంతో అకాల వర్షాలకు వడ్లు తడిసి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోవడంతో జిల్లా కేంద్రంలోని రామారెడ్డి చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. కాంటాలు వేయకపోవడంతో ధాన్యం మార్కెట్ యార్డులోనే ఉండిపోయిందని అన్నారు. బుధవారం కురిసిన అకాల వర్షానికి వడ్లు తడిసిపోయాయని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు. అధికారులు వచ్చి వెంటనే కొనుగోళ్లు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. -కామారెడ్డి

## ఒక్క నిమిషం కూడా కరెంటు పోవడం లేదు

- గతం కంటే నాణ్యమైన విద్యుత్తు ఇస్తున్నాం
- తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొంటున్నాం: ఉత్తమ్

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎక్కడా ఒక్క నిమిషం కూడా కరెంటు పోవడం లేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కంటే తాము ప్రస్తుతం నాణ్యమైన కరెంటు అందిస్తున్నామని పేర్కొన్నారు. గాంధీభవన్‌లో గురువారం శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కరువు వచ్చిందని, కరెంటు పోతున్నదంటూ ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఖండించారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని, ఇప్పటికే 25 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎన్నికలు ముగిశాక అర్హులైన వారికి రేషన్‌కార్డులు, ఇండ్లు కట్టిస్తామని చెప్పారు. తెలంగాణకు బీజేపీ చేసింది ఏమీలేదని, ఆ పార్టీ తమకు మూడు స్థానాల్లోనే పోటీ ఇస్తున్నదని పేర్కొన్నారు.

## • అకాల వర్షం.. రైతన్న ఆగమాగం



ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షానికి దెబ్బతిన్నది. గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి నిర్మల్ జిల్లా ఖానాపూర్ మార్కెట్ యార్డులోని ధాన్య పురాశులు తడిసి ముద్దయ్యాయి. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా అగచాట్లు పడ్డారు. కొన్నిచోట్ల కోసిన వరి పైరు పొలాల్లోనే ఉండటంతో గింజలు రాలిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల తమకు భారీగా నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు కూడా అధికారులు అందుబాటులో ఉంచడం లేదని రైతులు మండిపడుతున్నారు. - ఖానాపూర్ టౌన్

# దేశాన్ని ముంచి దేవుడి పేరుతో ఓట్లు

- పదేండ్లు పాలించి చెప్పుకోలేని దుస్థితి కేంద్రంలోని బీజేపీది
- బీజేపీని రాహుల్ ఎదుర్కోలేడు
- కాంగ్రెస్ చేతిలో మళ్లీ మోసపోవద్దు
- ఆర్నెల్లలో కేసీఆర్ చుట్టే తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు
- రాహుల్.. ప్రజలతో డ్రామాలా?
- కాంగ్రెస్, బీజేపీపై కేటీఆర్ నిప్పులు
- భైంసా పట్టణంలో రాళ్లు, కోడిగుడ్లతో కేటీఆర్‌పై దాడి
- విద్వేషంపై పోరాటం ఆగదు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



నిర్మల్ జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలో రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ)/మేడ్చల్, మంచిర్యాల, మే 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): దేశాన్ని ముంచి దేవుడి పేరుతో ఓట్లు అడిగేవారిని పట్టించుకోవద్దని బీజేపీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'దేవుడిని అడ్డం పెట్టుకుని రాజకీయం చేసేవాళ్లు.. చెప్పేది దేవుడు పేరు.. చేసేది అదానీకి సేవ' అంటూ ఆరోపించారు. గురువారం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అల్వాల్‌లో జరిగిన యూత్ మీటింగ్‌లో, నిర్మల్, భైంసాల్లో జరిగిన రోడ్‌షోల్లో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో పదేండ్లు పాలించిన బీజేపీకి.. ఏం చేసిందో చెప్పుకొనే దమ్ము లేదని విమర్శించారు. 'నరేంద్ర మోదీ ఏందయ్యా నీ గోల అంటే.. నమో అంటారు. నమో అంటే నమ్మించి మోసం' అని ఎద్దేవా చేశారు. మోదీ రూ.14 లక్షల కోట్లు అదానీ, అంబానీలకు రుణమాఫీ చేశారని, తాను చెప్పిందిన అబద్ధమని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని మరోసారి తేల్చిచెప్పారు. ఇక, మోదీతో కొట్లాడే ధైర్యం రాహుల్‌గాంధీకి లేదని అన్నారు. ప్రాంతీయ పార్టీలే మోదీగా బలంగా కొట్లాడుతాయని స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ బీజేపోళ్లు ఆ ప్రభుత్వాలను అలవోకగా పడగొట్టారు. కానీ కేసీఆర్, మమతాబెనర్జీ, హేమంత్ సోరెన్, స్టాలిన్, కేజ్రీవాల్ ప్రభుత్వాలను పడగొట్టే ప్రయత్నం చేసి బీజేపీ విఫలమైంది' అని వెల్లడించారు. బీజేపీతో బీఆర్ఎస్ ఎన్నడూ కలిసి పనిచేయలేదని, కలిసి ఉండి ఉంటే కవితను అరెస్టు చేసేవారా? అని ప్రశ్నించారు. అరచేతిలో వైకుంఠం చూపెట్టిన రేవంత్‌రెడ్డి.. ఐదు నెలల్లో రాష్ట్రాన్ని ఆగం చేశారని దుయ్యబట్టారు. ఆ మాటలు నమ్మితే మరోసారి మోసపోయి గోసపడాల్సి వస్తుందని ప్రజలకు సూచించారు.

### రాహుల్.. ఎందుకీ అబద్ధాలు?

తెలంగాణ ప్రజలతో డ్రామాలు ఆడుతున్నారా? అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. నెరవేర్చని వాగ్దానాలను నెరవేర్చినట్టు ఎలా చెప్తారని ప్రశ్నించారు. వేయని రైతుభరోసా వేసినట్టు ఎందుకు అబద్ధాలు చెప్తున్నారు? ఎక్కడన్నా ఒక్క రైతుకైనా రూ.7,500 సాయం అందిందా? నాడు రూ.15 లక్షలు వేస్తానన్న బడా భాయ్ వేయలేదు. నేడు రూ.15 వేలు ఇస్తానన్న చోటాభాయ్ ఇవ్వలేదు. రైతు భరోసా వేసినట్టు ఎందుకీ ఫోజులు..? అసత్యాలపై కాంగ్రెస్ స్వారీ ఇంకెన్ని రోజులు? డిసెంబర్ 9న చేస్తానన్న రెండు లక్షల రుణమాఫీ జాడేది? కౌలు రైతులు, కూలీలకు చేస్తామన్న సాయం సంగతేది? ఇదేనా మీరు చెప్పిన ప్రజాపాలన? నమ్మి ఓటేసిన పాపానికి ఏంటీ నయవంచన? ఇది ప్రజాపాలన కాదు.. ముమ్మాటికీ ఇది ప్రజా వ్యతిరేక పాలన. 420 మోసపూరిత వాగ్దానాలతో నాలుగుకోట్ల ప్రజలను వంచించిన పాలన. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాచైతన్యం వెల్లివిరుస్తుంది. తెలంగాణకు ఉన్న ఏకైక గొంతుక బీఆర్ఎస్‌వైపే ప్రజా తీర్పు ప్రతిధ్వనిస్తుంది' పేర్కొన్నారు. మోదీ పేర్కొంటున్నట్టు అదానీ, అంబానీలు టెంపోల నిండా స్కాంగ్రెస్ (కాంగ్రెస్)కు డబ్బు పంపితే ఆయన (మోదీ) ఇష్టమైన మిత్రులు ఈడీ, ఐటీ, సీబీఐ ఎందుకు మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు. దీన్నిబట్టి నోట్లరద్దు విఫలమైందని మోదీ అంగీకరిస్తున్నారా? అని నిలదీశారు. తెలంగాణను అనేక రంగాల్లో నంబర్ 1గా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని అన్నారు. ఇందుకు ఆర్బీఐ తాజాగా విడుదల చేసిన గణంకాలే సాక్ష్యాలని పేర్కొన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పాలిత ఏ రాష్ట్రంలోనైనా ఇలాంటి ప్రగతిని చూపించే దమ్ముందా? అని సవాల్ చేశారు.

### ఆర్నెల్లలో కేసీఆర్ చుట్టే రాష్ట్ర రాజకీయాలు

కేసీఆర్ ఉన్నప్పుడు ఎట్లా ఉన్నది? ఇవాళ ఎట్లా ఉన్నది? అన్నది చూడాలని కేటీఆర్ ప్రజలను కోరారు. ఒక్క హామీ నెరవేర్చని కాంగ్రెస్ ఓటేద్దామా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ఒక గుడులు కట్టుడే కాదు.. ఆధునిక దేవాలయాలు కట్టారని తెలిపారు. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం సహా కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను కటి నీళ్లు తెచ్చారని వెల్లడించారు. 'కేసీఆర్ ఉన్నప్పుడే తెలంగాణ బాగుండే అనుకునేటోళ్లు మే 13న బీఆర్ఎస్‌కు 10–12 ఎంపీ సీట్లు అప్పజెప్పండి. ఆరు నెలల్లో కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసించే పరిస్థితి వస్తది. రాష్ట్ర రాజకీయం మొత్తం కేసీఆర్ చుట్టే గింగిరాలు కొడుతది' అని అన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, నందికంటి శ్రీధర్, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు తదితరులు పాల్గొన్నారు.

### కేటీఆర్‌పై భైంసాలో రాళ్ల దాడి

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గం భైంసాలో కేటీఆర్‌పై కొందరు నిరసనకారులు రాళ్లు, టమాటలు, ఉల్లిగడ్డలు, కోడిగుడ్లతో దాడికి పాల్పడ్డారు. రోడ్‌షో ప్రారంభించడానికి ముందే ప్లాన్ చేసి మరీ కొందరు నిరసనకు దిగారు. హనుమాన్ మాలధారులను రెచ్చగొట్టి ప్లకార్డులు ప్రదర్శించేలా చేశారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న కేటీఆర్.. 'బ్రదర్ మీరు ఏమైనా లొల్లి చేసేది ఉంటే మీరు మీరు చేసుకోండి. ఇక్కడ చిల్లర పంచాయితీలు చేయకండి. మీ ప్రచారం మీరు చేసుకోండి. మా ప్రచారం మేము చేసుకుంటాం' అని చెప్పారు. ఆయన మాట వినకుండా దాడి చేశారు. అయినా కేటీఆర్ సహనం పాటించారు. దీంతో రోడ్‌షోకు వచ్చిన జనం జై తెలంగాణ అంటూ ఆయనకు మద్దతుగా నిలిచారు. దాడి అనంతరం కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. భైంసాలో తనపై జరిగిన దాడి విషయంలో అభిమానులు ఆందోళన చెందవద్దని అన్నారు. తనకేమైనా జరిగిందేమోనని అభిమానులు ఫోన్లు చేస్తున్నారని తెలిపిన ఆయన.. తన క్షేమ సమాచారాన్ని తెలిపారు. భైంసాలో బీజేపీ గూండాలు రాళ్లు విసిరారని వెల్లడించారు. విద్వేషాన్ని వ్యాప్తి చేసే వారిపై, మతం పేరుతో విషం చిమ్మే వారిపై తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు.